తమిళతల్లి ప్రార్థనలో ద్రావిడం తొలగింపు

హిందీ మాసోత్సవంలో అధికారుల అత్యుత్సాహం



నిరసన తెలుపుతున్న డీఎంకే యువజన విభాగం



గవర్నర్ ఆర్‌ఎన్ రవి

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ దూరదర్శన్ కేంద్రం స్వర్ణోత్సవాలతో పాటు శుక్రవారం మధ్యాహ్నం జరిగిన హిందీ మాసోత్సవ సభ ప్రారంభంలో అధికారులు గవర్నర్ సాక్షిగా అత్యుత్సాహం ప్రదర్శించారు. తమిళనాడు ప్రభుత్వ అధికారిక గీతమైన తమిళ తల్లి ప్రార్థనాగతంలో వున్న ఓ వ్యాక్యాన్ని తొలగించి దుస్సాహసానికి తెగబడ్డారు. రాష్ట్ర ప్రథమ పౌరుడైన గవర్నర్ పాల్గొన్న కార్యక్రమంలోనే ఇలా జరగడంతో ఇదంతా ఆయన సూచన మేరకే జరిగినట్టుగా రాజకీయ పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హిందీ మాసోత్సవంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి పాల్గొన్నారు. తమిళ తల్లి ప్రార్థన గీతంలో 'తెక్కణముమ్ అదిశిరంద ద్రావిడనల్ తిరునాడుమ్' (అన్ని దిక్కులా అన్ని రంగాల్లో విశిష్టస్థాయిలో ఉన్న ద్రావిడ నాడు) అనే వాక్యం లేకుండా చేశారు.

డీడీ తమిళ్ ఛానెల్ క్షమాపణలు...

హిందీ మాసోత్సవం సందర్భంగా తమిళ తల్లి ప్రార్థనాగీతంలో ఓ వాక్యం లేకపోవడం పట్ల ఆ వేడుకలు నిర్వహించిన డీడీ తమిళ ఛానెల్ నిర్వాహకులు క్షమాపణలు తెలిపారు. తమ పరధ్యానం వల్లే ఈ పొరపాటు జరిగిందని, అనుకోకుండా జరిగిన ఈ పొరపాటుకు క్షమాపణలు కోరుతున్నామని, ఎట్టి పరిస్థితులలోనూ తమకు తమిళ తల్లి ప్రార్థనా గీతాన్ని కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

- గవర్నర్ సమక్షంలోనే దుస్సాహసం
- ఆయన్ని రీకాల్ చేయండి
- కేంద్రానికి స్టాలిన్ డిమాండ్

స్టాలిన్ ధ్వజం

గవర్నర్ పాల్గొన్న హిందీ మాసోత్సవ సభలో తమిళ తల్లి ప్రార్థనకు తీరని కళంకం జరిగిందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ రవి ఎప్పుడూ చట్ట ప్రకారం కాకుండా తన ఇష్ట ప్రకారమే నడచుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. ఈ మేరకు స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో తీవ్ర విమర్శలు చేశారు. ద్రావిడం అనే పదమున్న వాక్యాన్ని తొలగించి తమిళతల్లి ప్రార్థన పాడటం రాష్ట్ర చట్టాన్నే వ్యతిరేకించడమవుతుందన్నారు. చట్ట ప్రకారం కాకుండా ఇలా ఇష్ట ప్రకారం నడచుకునే ఈ గవర్నర్ ఆ పదవికే అనర్హుడన్నారు. హిందీ భాషోత్సవం పేరుతో దేశ సమైక్యతకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా తమిళులను కించపరుస్తున్నారని ఆరోపించారు. ద్రావిడం అంటే అలెర్జీగా భావిస్తున్న గవర్నర్ జాతీయగీతంలో ఉన్న ద్రావిడం అనే పదాన్ని విడిచిపెట్టి పాడగలరా? అని స్టాలిన్ ప్రశ్నించారు. తమిళనాడును, తమిళ ప్రజల మనోభావాలను ఉద్దేశపూర్వకంగా అవమానిస్తున్న గవర్నర్‌ను కేంద్రం ప్రభుత్వం తక్షణమే రీకాల్ చేయాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా గవర్నర్ తీరును ఖండిస్తూ డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నైలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలు – గవర్నర్

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనపై జాత్యహంకారపూరితమైన వ్యాఖ్యలు చేశారని, తమిళ తల్లి ప్రార్థనాగీతాన్ని అగౌరవపరచినట్లు తప్పుడు ఆరోపణలు చేశారని రాష్ట్ర గవర్నర్ ఆరోపించారు. ఈ మేరకు రాజ్‌భవన్ సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేసింది. తాను ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ భక్తి శ్రద్ధలతో తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని తప్పు లేకుండా గానం చేయగలననే విషయం స్టాలిన్‌కు బాగా తెలుసన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం తమిళ భాష, దాని ఔన్నత్యాన్ని ప్రపంచమంతటా ఎలుగెత్తి చాటేలా వివిధ సంఘాలను కూడా ఏర్పాటు చేసిందని, ఐక్యరాజ్యసమితి లోనూ తమిళభాషకు పట్టంగట్టేలా చర్యలు తీసుకున్నారన్నారు. తాను కూడా దేశంలోనే ప్రాచీనమైన తమిళ భాషను ఇతర రాష్ట్రాల్లోనూ వ్యాపింప చేయడానికి కృషిచేస్తున్నానన్నారు. ఇటీవల అస్సామ్ ప్రభుత్వ సహకారంతో గౌహతి విశ్వవిద్యాలయంలో తమిళ పాఠ్యాంశాన్ని కూడా ప్రవేశపెట్టానని తెలిపారు. ఓ గవర్నర్‌కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి జాత్యహంకార వ్యాఖ్యలు, తప్పుడు ఆరోపణలు చేయడం దురదృష్టకరమని, హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాలిన్‌వి ముఖ్యమంత్రి హోదాను కళంకపరిచే వ్యాఖ్యలని అన్నారు. తొందరపడి జాత్యహంకార వ్యాఖ్యలను ముఖ్యమంత్రి బహిర్గతంగా వెల్లడించిన కారణంగా దానిపై తాను స్పందించాల్సిన అవసరం ఏర్పడిందని గవర్నర్ రవి పేర్కొన్నారు.



వేళచ్చేరి మెయిన్‌రోడ్డులో ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

జలదిగ్బంధంలోనే శివారు ప్రాంతాలు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో, శివారు ప్రాంతాల్లో కుండపోత వర్షం ఆగి మూడు రోజులు దాటినా శివారు ప్రాంతాల్లోని వారంతా ఇంకా జలదిగ్బంధంలో ఉన్నారు. కార్పొరేషన్ అధికారుల సమాచారం మేరకు శివారు ప్రాంతాల్లో సుమారు 500 కుటుంబాలు వాననీటిలోనే కాపురం చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాలైన చోళవరం, రెడ్‌హిల్స్, వేళచ్చేరి, ఆవడి, తాంబరం, ముడిచ్చూరు, ముగిలివాక్కం తదితర ప్రాంతాల్లో ఇళ్లచుట్టూ చేరిన వాననీటిలోనే అవస్థలు పడుతున్నారు. రెడ్‌హిల్స్ సమీపం కుమరన్ నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని అగ్నిమాపక సిబ్బంది రబ్బరు పడవల్లో తరలిస్తున్నారు. ఇదే విధంగా శ్రీరామ్‌నగర్, మీనాక్షి నగర్, సన్‌సిటీ మహామేరు నగర్, పాడియనల్లూరు, సెంథిల్‌వేలన్ నగర్, మధురవాయల్, వానగరం, అంబత్తూరు పారిశ్రామికవాడ, తాంబరం సమీపం ముడిచ్చూరు ప్రాంతాల్లోనూ మూడు రోజులుగా వాననీటిలోనే స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు కూడా నిలిపివేశారు. దీంతో నిత్యావసర సరకుల కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ కార్మికులు ఈ ప్రాంతాల్లో దోమలబెడద నివారించేందుకు ఫాగింగ్ చేస్తున్నారు.



నీటమునిగిన పుదుపాళయం రహదారి వంతెన

ఆరణి వాగుకు తగ్గని వరద

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం వద్ద ఆరణి వాగులో నీటిమట్టం విపరీతంగా పెరిగి నీరంతా రోడ్లపై ప్రవహించింది. ఈ కారణంగా అంజాతమ్మన్ కోవిల్ బస్టాపు నుంచి పుదుపాళయం వెళ్లే రహదారిలో ఆరణి వాగుపై ఉన్న వంతెన పూర్తిగా మునిగింది. ఇదే విధంగా ఆరణి సామాజిక కేంద్రం నుంచి మంగళం గ్రామానికి వెళ్లే మార్గంలోనూ రహదారి వంతెనపై రెండడుగుల ఎత్తున వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం ఆ రెండు వంతెనలపై మూడడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. స్థానికులను కూడా ఆ వంతెనల మీదుగా నడచి వెళ్ళకుండా అధికారులు కట్టుదిట్టంచేశారు. ఆరణివాగులో వరద నెలకొనడంతో మంగళం, పుదుపాళయం, కారణి, ఆత్తుమేడు నెల్‌వాయ్, ఎరుక్కువాయ్ కండిగ తదితర 15 గ్రామాల ప్రజలు సుమారు 10 కి.మీ. మేర చుట్టూ నడిచి వెళ్ళి పెరియపాళయం చేరుకుంటున్నారు. ప్రస్తుతం ఆరణి వాగు వరద నీటితో మునిగిన వంతెనలకు ఇరువైపులా ఆరణి, పెరియపాళయం పోలీసులు కాపలా కాస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రతియేటా ఈ రెండు వంతెనలు వర్షాకాలంలో ఆరణివాగు జలాల్లో మునగటం ఆనవాయితీగా మారిందని, ఈ పరిస్థితి మారాలంటే అంజాత్తమ్మన్ - పుదుపాళయం మధ్య ఆరణివాగుపై రూ.22 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మంగళం రోడ్డులోని రహదారి వంతెనై ఉధృతంగా ప్రవహిస్తున్న ఆరణి వాగు జలాలు

● దీపావళి కానుక..

ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం తీపికబురు

3 శాతం కరవుభత్యం ● జూలై 1 నుంచి వర్తింపు



చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దీపావళి సమయంలో తీపి కబురు చెప్పారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 3 శాతం డీఏ పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ పెంచిన డీఏని జూలై ఒకటో తేదీ నుంచే వర్తింపజేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ సిబ్బంది, ఉపాధ్యాయులు 50 శాతం చొప్పున కరవుభత్యం పొందుతున్నారని, 3 శాతం పెంపుతో కరవుభత్యం 53 శాతానికి పెరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జూలై ఒకటి నుంచి కరవు భత్యాన్ని పెంచాలంటూ తనకు పలుమార్లు విజ్ఞప్తి చేశారని, ఆ విషయంపై ఆర్థిక శాఖ అధికారులతో చర్చించిన మీదట కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే 3 శాతం కరవుభత్యాన్ని పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కరవు భత్యం పెంపువల్ల 16 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కుటుంబ పింఛనుదారులు లబ్ధిపొందనున్నారని తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1931 కోట్ల మేర అదనపు వ్యయభారం పడుతుందని, అయితే ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని స్టాలిన్ ఆ ప్రకటనలో తెలిపారు.

పుదువై ప్రభుత్వ సిబ్బందికి దీపావళి బోనస్ రూ.7వేలు

పుదుచ్చేరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి పండుగ సందర్భంగా రూ.7వేలు బోనస్‌గా చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ సిబ్బందికి తాత్కాలిక బోనస్ గణించే గరిష్ఠ పరిమితిని రూ.7వేలుగా స్థిరీకరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ వేతన విధానాన్ని అనుసరించే పుదుచ్చేరి యూనియన్ ప్రాంత ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది. ఆ ప్రకారం పుదుచ్చేరి ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న బీ, సీ గ్రేడు సిబ్బందికి దీపావళి బోనస్‌గా రూ.7వేలు చెల్లించనున్నట్లు ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి శివకుమార్ శుక్రవారం ఓ ఉత్తర్వులు జారీ చేశారు.

పదవులు శాశ్వతం కావు

- ఎవరి కాళ్లపైనా పడొద్దు
- టీవీకే ఇన్‌ఛార్జులకు బుస్సీ ఆనంద్ హితవు



పార్టీ ఇన్‌ఛార్జుల శిక్షణా శిబిరంలో పాల్గొన్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)లో పదవులు శాశ్వతం కావని, పార్టీకి పాటుపడటమే అందరి ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అన్నారు. విల్లుపురం జిల్లా విక్రవాండిలో ఈ నెల 27 పార్టీ తొలి మహానాడు జరుగనుండటంతో శుక్రవారం ఉదయం సేలం సమీపం ఆత్తూరు అమ్మాపాళయంలోని కల్యాణమండపంలో పార్టీ ఇన్‌చార్జుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహానాడుకు జనసేకరణ తదితర అంశాలపై చర్చలు జరిపారు. సభలో బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ సేలం జిల్లా అంతటా పార్టీ నిర్వాహకులు భారీగా పోస్టర్లు అతికించి తనకు ఘన స్వాగతం పలికారని, అదే సమయంలో తనను పార్టీ శాశ్వత ప్రధాన కార్యదర్శి అని కొన్నిపోస్టర్లలు ముద్రించడం తనకు అసంతృప్తి కలిగించిందన్నారు. పార్టీలో పదవులు శాశ్వతం కావని, తాను శాసన సభ్యుడిగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవలందించానని, తొలి నుండి తాను విజయ్‌కి అభిమానిగా ఉండటం వల్లే ప్రధాన కార్యదర్శి బాధ్యతలు తనకప్పగించారని చెప్పారు. ఇక పార్టీకి చెందిన జిల్లా స్థాయి నాయకులుగానీ, కార్యకర్తలు గానీ ఎవరి కాళ్లపైనా పడకూడదని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రులు తప్ప మరెవరి కాళ్లపైనా పడకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఆ నలుగురూ తోడు దొంగలు

- డీఎంకే, బీజేపీ, శశికళ, ఓపీఎస్‌పై నటి గాయత్రి ధ్వజం
- అన్నామలై పరారైన నేత అంటూ వ్యాఖ్యలు



గాయత్రి రఘురాంతో డాక్టర్ సునీల్, విజేతలు

అడయార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేను ఏదో రూపంలో విచ్ఛిన్నం చేయాలని డీఎంకే, బీజేపీ, శశికళ, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కుట్ర పన్నారని, ఇందుకోసం వారంతా శతవిధాలా ప్రయత్నిస్తున్నారని సినీ నటి, అన్నాడీఎంకే మహిళా నేత గాయత్రి రఘురాం సంచలన వ్యాఖ్యలు చేశారు. అన్నాడీఎంకే 53వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని, అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో క్యారమ్‌బోర్డు ఫైనల్ పోటీలను శుక్రవారం టి.నగర్‌లో నిర్వహించారు. ఈ పోటీ విజేతలకు నటి గాయత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేను విచ్ఛిన్నం చేయాలని, ఏదో ఒక రూపంలో పార్టీని చీల్చాలని నాలుగు దుష్టశక్తులు పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇందుకోసం డీఎంకే, బీజేపీ, పన్నీర్‌సెల్వం, శశికళ ఒప్పందంతో పనిచేస్తున్నారన్నారు. కానీ, వారి కుట్రలు ఏమాత్రం ఫలించబోవన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే ఎంతో పటిష్ఠంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై తన దృష్టిలో నాయకుడే కాదన్నారు. పారిపోయిన వ్యక్తి గురించి తన వద్ద ప్రస్తావించవద్దని మీడియాకు సూచించారు. 2026లో జరిగే ఎన్నికల్లో తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోదని, ఈ విషయాన్ని తమ పార్టీ నేత ఈపీఎస్ ఇప్పటికే తేటతెల్లం చేశారన్నారు. 2026లో తాము ఖచ్చితంగా అధికారంలోకి వస్తామని ఆమె జోస్యం చెప్పారు. కేవలం రెండు మూడు గంటలు కురిసిన వర్షానికే చెన్నై నగరం నీట మునిగిందని ఆరోపించారు. వర్షపునీటి కాల్వల నిర్మాణం కోసం కేటాయించిన రూ.4 వేల కోట్లు ఎక్కడికి వెళ్ళాయని ఆమె ప్రశ్నించారు. వర్షపు నీరు నిల్వలేని ప్రాంతాల్లో సీఎం, డిప్యూటీ సీఎంలు పర్యటించి, ఫొటోలు తీసి వాటిని షేర్ చేయడం కాదదని, టీవీల్లో చూపించే ప్రాంతాల్లో పర్యటించాలని ఆమె సూచించారు. నగరం జలదిగ్బంధంలో చిక్కుకున్న విషయంపై ప్రశ్నించిన తమ పార్టీ అగ్రనేత ఎడప్పాడిని క్షేత్ర పర్యటనకు రావాలని ఆహ్వానించడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే, ఎడప్పాడి లేకుండా డీఎంకే నేతలు ఏమీ చేయలేరా అని గాయత్రి రఘురాం ప్రశ్నించారు.

నేటినుంచి పాస్‌పోర్ట్ సేవలకు అంతరాయం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ వెబ్‌సైట్ సేవలు శనివారం రాత్రి 7 నుంచి 21వ తేది ఉదయం 6 గంటల వరకు పనిచేయవని పాస్‌పోర్ట్ కార్యాలయం తెలిపింది. సాంకేతిక నిర్వహణ పనుల కారణంగా రెండు రోజులు ఈ సేవలు నిలిపివేయనున్నారు. www.passportindia.gov.in అనే వెబ్‌సైట్ సేవలు 21వ తేది ఉదయం 6 గంటల నుంచి యధావిధిగా కొనసాగనున్నాయి.

పాఠశాలల్లో కళా ప్రదర్శన పోటీలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా వాయిదావేసిన కళా ప్రదర్శన పోటీలు నిర్వహించాలని పాఠశాలలకు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, 1-5 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయి పోటీలు ఈ నెల 30వ తేది లోపు, జిల్లా స్థాయి పోటీలు నవంబరు 7వ తేదీలోగా నిర్వహించాలి. 6-12 తరగతుల విద్యార్థులకు నవంబరు 7వతేదిలోగా పోటీలు నిర్వహించి, 8వ తేది విజేతల వివరాలు అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

షిర్డీకి ఆధ్యాతిక పర్యాటక యాత్ర

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి షిర్డీకి ఆధ్యాత్మిక పర్యాటక యాత్రను ఐఆర్‌సీటీసీ పరిచయం చేసింది. ఆ ప్రకారం, వారంలో బుధవారం ఉదయం 10.10 గంటలకు చెన్నైలో బయల్దేరి శనివారం ఉదయం 9.40గంటలకు తిరిగి చెన్నై చేరుకొనేలా యాత్ర ఉంటుంది. ఈ పర్యాటక ప్యాకేజీలో రైలు టిక్కెట్లు, పర్యాటక ప్రాంతాలకు వాహన సదుపాయం, ఒకరోజు విడిది చార్జీలు తదితరాలుంటాయి. వివరాలకు 8287931972, 9363488231 అనే నెంబర్లలో సంప్రదించవచ్చు.

22న వక్తృత్వ పోటీలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తమిళ అభివృద్ధి శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఉత్తర చెన్నై పరిధిలో వ్యాసర్పాడిలోని డా.అంబేడ్కర్ ఆర్ట్స్ కళాశాల, మధ్య చెన్నై పరిధిలో చేపాక్కంలోని రాజధాని కళాశాల, దక్షిణ చెన్నై పరిధిలో రాణిమేరి కళాశాలలో ఉదయం 9 గంటలకు పోటీలు జరుగనున్నాయి. పాఠశాల విద్యార్థులకు 'గాంధీ మతసామరస్యం', ' గాంధీలా నేను', 'పడవ నడిపిన తమిళుడు, గాంధీ' అనే శీర్షికలు, కళాశాల విద్యార్థులకు 'గాంధీ అహింసా పోరాటం', 'తమిళులు చూసిన గాంధీ', 'గాంధీ మరియు నెహ్రూ' అనే శీర్షికలపై పోటీలు జరుగనున్నాయి.

నేటినుంచి నుంగంబాక్కంలో దీపావళి సంత

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాలు రూపొందించిన ఉత్పత్తులతో దీపావళి ప్రత్యేక సంత శనివారం నుంగంబాక్కంలో ప్రారంభం కానుంది. అన్నై థెరిస్సా మహిళా ప్రాంగణంలోని సంతలో, కాంచీపురం పట్టుచీరలు, విరుగునగర్ కాటన్ దుస్తులు, ఈరోడ్ దుప్పట్లు, కోవై నిగమం చీరలు సహా పలురకాల దుస్తులు, చిరుధాన్యాలు, సహజ సిద్ధ ఉత్పత్తులతో కూడిన స్టాల్స్ ఏర్పాటుకానున్నాయి. ఆదివారం వరకు జరుగనున్న ఈ సంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

కోడిగుడ్ల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల్లో 9.80 లక్షల మంది, అంగన్వాడీ కేంద్రాల్లో 4.51 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు అందిస్తున్నారు. వారానికి 2.7 కోట్ల చొప్పున ఏడాదికి 119.87 కోట్ల కోడిగుడ్లు విద్యార్థులకు అందజేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వారంలో రెండు సార్లు, పాఠశాలలకు వారంలో ఒక రోజు కోడిగుడ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. అర్హతలు కలిగిన సంస్థలు నవంబరు 14వ తేది ఉదయం 11 గంటల్లోపు దరఖాస్తు సమర్పించాలని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

దూరవిద్యా కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): దూరవిద్య కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 31వ తేది వరకు పొడిగించారు. ఈ మేరకు ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) విడుదల చేసిన ప్రకటనలో... దూరవిద్య విభాగంలో 2024 విద్యా సంవత్సరంలో సర్టిఫికెట్, సెమిస్టర్ ఆధారిత కోర్సులు మినహా యూజీ, పీజీ, డిప్లొమో కోర్సుల్లో చేరే విద్యార్థులు http-s://ignouadmission.samarth.edu.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించారు. అలాగే, వర్సిటీ అందిస్తున్న బీఏ, బికాం, బీఎస్సీ కోర్సుల్లో చేరే అర్హత కలిగిన ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఫీజునుంచి మినహాయింపు కల్పించారు. అడ్మిషన్ల వివరాలను www.ignou.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.వివరాలకు చెన్నై మండల కార్యాలయం 044-26618040 అనే నెంబరుకు సంప్రదించవచ్చని వర్సిటీ తెలిపింది.

బాంబ్ స్క్వాడ్‌లో మాజీ సైనికులకు ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలోని బాంబ్ స్క్వాడ్ విభాగంలో చేరేందుకు మాజీ సైనికులు, పారా మిలిటరీ సైనికులు దరఖాస్తు చేసుకోవచ్చు. 50 ఏళ్లలోపున్న వారు అర్హులు. విద్యార్హత, అనుభవం తదితర వివరాలను, సర్టిఫికెట్లతో దరఖాస్తులను 'పోలీసుశాఖ చైర్మెన్ కార్యాలయం, మరుదం, నెం.17,బోట్‌క్లబ్ రోడ్డు, రాజా అన్నామలైపురం, చెన్నై-28' అనే చిరునామాకు నవంబరు 14వ తేదిలోపు పంపించాలి.



పేలుడికి ధ్వంసమైన ఇంటి నుండి ఎగసిపడుతున్న మంటలు - మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మహాబలిపురంలో పేలుడు

నాలుగిళ్లు ధ్వంసం

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహాబలిపురం మహిళా పోలీసుస్టేషన్ సమీపంలో పాత క్వార్టర్స్‌లో శుక్రవారం వేకువజాము సంభవించిన పేలుడులో నాలుగిళ్లు ధ్వంసమయ్యాయి. పలు ఇళ్లలోని కిటికీల అద్దాలు పగిలాయి. పోలీసులు ట్రాఫిక్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న పాత వాహనాలున్న ప్రదేశంలో పేలుడు సంభవించి, నలువైపులా మంటలు వ్యాపించాయి. ఆ వాహనాలకు చేరువగా ఉన్న నాలుగు ఇళ్ల గోడలు కూలాయి. అదే సమయంలో క్వార్టర్స్‌లోని పలు ఇళ్లల్లో గోడలు బీటలువారాయి. ఈ సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. పాత బైకులున్న ప్రాంతంలో ఏదైనా ఒకటి రెండు వాహనాల్లో పెట్రోలు లీకై నిప్పంటుకుని బ్యాటరీలు పేలి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం పేలుడు సంభవించిన ప్రాంతంలో ఫోరెన్సిక్ నిపుణులు పేలుడు పదార్థాలను సేకరిస్తున్నారు. చెంగల్పట్టు డీఎస్పీ సాయి ప్రణీత్ ఉత్తర్వుల మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

'డాక్టర్ ఉమర్ అలీషా సాహిత్యంపై

డిసెంబరు 9,10 తేదీల్లో సదస్సు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంస్కృతాంధ్ర, ఆంగ్ల, అరబ్బీ, ఫ్రెంచి, పారశీక, హిందీ భాషల్లో అద్వితీయమైన విజ్ఞానాన్ని సంపాదించి, ఆ ప్రతిభను సామాజికం వైపు మళ్లించిన దార్శనికులు డాక్టర్ ఉమర్ అలీషా జీవితం-సాహిత్యంపై మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 9, 10 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. 'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ అలీషా సాహిత్యం - బహుముఖనీత' అనే అంశంపై జరుగనున్న ఈ సదస్సులో పాల్గొనదలచిన ఔత్సాహిక పరిశోధన వ్యాస రచయితలకు మద్రాస్ యూనివర్సిటీ ఆహ్వానం పలుకుతోందని వర్సిటీ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సులో సమర్పించే పరిశోధన వ్యాసాలను యూజీసీ కేర్ జర్నల్ 'మూసి' పత్రికలో ప్రచురించి, సదస్సు ప్రారంభంలో ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం ఉమర్ అలీషా జీవితం, సాహిత్య విశేషాలు తెలిపే విధంగా వ్యాసాలు పంపించాలని ఆచార్య విస్తాలి విజ్ఞప్తి చేశారు. రచనలు నవంబరు 22వ తేదీ లోగా నిర్వాహకులకు అందాలి. పూర్తి వివరాలకు ఆచార్య విస్తాలి శంకరరావు (9445203041), డాక్టర్ పాండురంగం కాళియప్ప (9701869674), డాక్టర్ మాదా శంకరబాబు (7200685477)లను సంప్రదించవచ్చు.

హోంగార్డు విభాగానికి అభ్యర్థుల ఎంపిక

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఉద్యోగానికి ఎలాంటి వేతనం ఇవ్వరు. ఉత్తమ విధులు నిర్వహించిన వారు ముఖ్యమంత్రి, రాష్ట్రపతి పతకాలకు అర్హులు. చెన్నైకి చెందిన 18-50 లోపుండి, నేరచరిత్ర లేని వారు ఈ నెల 31వ తేదిలోగా సైదాపేటలోని హోంగార్డు ప్రధాన కార్యాలయంలో గాని, తపాలా ద్వారా దరఖాస్తులు పంపించవచ్చు.

జీసీసీ పరిధిలోకి మూడు కాలువలు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడు కాలువలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, విరుగంబాక్కం కాలువ, ఓట్టేరి నల్లా కాలువ, వీరంగల్ కాలువలను ఇకపై కార్పొరేషన్ పర్యవేక్షిస్తుందని ప్రభుత్వం తెలిపింది.

రామేశ్వరంలో 'వాటర్ స్పోర్ట్స్ సెంటర్'

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపంలో రూ.44 కోట్లలో 'సముద్ర జల క్రీడా కేంద్రం' ఏర్పాటుకానుంది. రాష్ట్రంలో 1,076 కి.మీ మేర తీరప్రాంతం ఉండగా, రామనాథపురం జిల్లాలో గరిష్టంగా 237 కి.మీ ఉంది. జిల్లాలో ధనుష్కోటి, రామేశ్వరం, పాంబన్, ప్రబ్బన్‌వలసాయి బీచ్ ప్రాంతాలు సర్ఫింగ్, స్విమ్మింగ్, పాడిల్ బోటింగ్, పెడల్ బోటింగ్ సహా జలక్రీడలకు అనువైన ప్రదేశాలు. ఈ విషయమై రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ... రామేశ్వరం సమీపం ప్రబ్బన్‌వలసాయి బీచ్ సముద్ర జల క్రీడలకు అనువైన ప్రాంతంగా నిపుణులు సూచించారని, ఆ ప్రాంతంలో 7 ఎకరాల్లో వాటర్ స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.44 కోట్లు కేటాయిందని, త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఉత్తర చెన్నై విద్యుత్ కేంద్రంలో 45 రోజులు ఉత్పత్తి నిలిపివేత

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులోని ఉత్తర చెన్నై థర్మల్ కేంద్రంలో 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రంలోని రెండో యూనిట్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా గురువారం నుంచి 45 రోజులు ఉత్పత్తి నిలిపివేశారు. అలాగే, ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంచర్ కారణంగా గురువారం రాత్రి ఉత్పత్తి నిలిచిపోయిందని, మరమ్మతుల అనంతరం ఉత్పత్తి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 'సింగిల్ రూమ్'

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే వారి సౌకర్యార్థం 'సింగిల్ రూమ్'తో కూడిన ఇళ్లు నిర్మించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఈ విషయమై హౌసింగ్ బోర్డు అధికారి ఒకరు మాట్లాడుతూ... గతంలో కీల్పాక్కం, అన్నానగర్‌లో నిర్మించిన సింగిల్ రూమ్ ఇళ్లు శిధిలావస్థకు చేరడంతో, వాటిని కూల్చివేసి కొత్త నిర్మాణాలు చేపట్టామన్నారు. సింగిల్ రూమ్‌తో ఉండే ఈ ఇళ్లలో ఎలాంటి అడ్డుగోడలు నిర్మించమని, ఈ ఇళ్లు కొనుగోలు చేసే వారు తమకు ఇష్టమైన విధంగా ఇంటిని మార్చుకోవచ్చని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే వాటిని విక్రయించేలా, అద్దెకివ్వాలా అనే విషయమై నిర్ణయం తీసుకుంటామని అధికారి తెలిపారు.

వైద్యకోర్సుల్లో చేరని 1,143 మంది

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు, అఖిల భారత కోటాలో చేరిన పొరుగు రాష్ట్రాల వారు మొత్తం 1,143 మంది తమ సీట్లు తిరిగి అప్పగించారు. స్వయం ప్రతిపత్తి కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్ సీటుకు రూ.13.5 లక్షలు, ప్రభుత్వ కోటా సీట్లకు రూ.4.5 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. కానీ, మేనేజ్‌కోటా సీట్లకు రూ.19 లక్షలు, ప్రభుత్వ కోటా సీట్లకు రూ.11 లక్షలు వసూలుచేస్తున్నట్లు సమాచారం. ఫీజుల పెంపు కారణంగా సీట్లు పొందిన విద్యార్థులు వాటిని తిరిగి అప్పగిస్తున్నారు. అలాగే, ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు పొందిన విద్యార్థులు, ఎయిమ్స్, కేంద్ర విశ్వవిద్యాలయంలో సీటు లభించడంతో వెళ్లిపోయారు. ఆ ప్రకారం, ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 59 ఎంబీబీఎస్, 62 బీడీఎస్, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో 503 ఎంబీబీఎస్, 519 బీడీఎస్ మొత్తం 1,143 సీట్లు తిరిగి అప్పగించారు. ఈ సీట్లను తదుపరి జరిగే కౌన్సెలింగ్‌లో భర్తీచేయనున్నట్లు వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ తెలియజేసింది.

'మత్తురహిత తమిళనాడు'పై రీల్స్, మీమ్స్‌కు ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా తమిళాభివృద్ధి, సమాచార శాఖ ఆధ్వర్యంలో 'మత్తు రహిత తమిళనాడు' పేరుతో రీల్స్, పోస్టర్ డిజైన్, మీమ్స్ తదితరాలు ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలను మహిళలు, పురుషులు, యువతీ యువకులు, విద్యార్థులు ఇలా పలు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఆలోచింపజేసే విధంగా చిత్రీకరించిన రీల్స్, మీమ్స్, పోస్టర్ డిజైన్‌లను నవంబరు 15వ తేదిలోపు tndiprmediahub@gmail.com అనే ఈ-మెయిల్‌కు పంపంచాలి. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రశంసా పత్రాలు అందజేస్తామని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

21న సీఎం నేతృత్వంలో సామూహిక వివాహం

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వం లో చెన్నై మండల దేవాలయాల ఆధ్వర్యంలో తిరువాన్మియూర్‌లో సోమవారం 31 జంటలకు సామూహిక వివాహం జరుగనుంది. బడ్జెట్ సమావేశాల్లో హిందూ దేవాదాయ శాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మాట్లాడుతూ... ఆర్థికంగా వెనుకబడిన 700 మంది జంటలకు 4 గ్రాముల మంగళ సూత్రం, రూ.60 వేల విలువైన ఇంటి సామగ్రి, కొత్త దుస్తులు అందించనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకారం తిరువాన్మియూర్‌లో సోమవారం జరిగే కార్యక్రమంలో సీఎం స్టాలిన్ పాల్గొని, 31 జంటలకు వివాహం జరిపించనున్నారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 304 జంటలకు వివాహాలు జరిపించనున్నట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

సీఐఎఫ్ఐ అధ్యక్షుడిగా నౌషద్ ఎన్నిక

అడయార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్ (సీఐఎఫ్ఐ) వార్షిక సర్వసభ్య సమావేశం నగరంలో ఇటీవల జరిగింది. ఇందులో ఆ సమాఖ్య కొత్త అధ్యక్షుడిగా వి.నౌషద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, 'విజన్ 2030' పేరుతో ప్రతిష్ఠాత్మకమైన ఒక డాక్యుమెంట్ రూపొందించి, భారతదేశ పాదరక్షల పరిశ్రమను మరింతగా ముందుకు తీసుకెళ్లే వ్యూహాలపై చర్చించారు. ఇందులో పరిశ్రమకు చెందిన పారిశ్రామికవేత్తలు, షేర్ హోల్డర్లు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వచ్చే రెండేళ్ళకుగాను కొత్త అధ్యక్షుడిగా వి.నౌషద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిశ్రమల వృద్ధి, ఆవిష్కరణలు, ప్రపంచ నాయకత్వం వైపు పరిశ్రమను నడిపించేందుకు నౌషద్ నాయకత్వం కృషి చేయాలని ఈ సందర్భంగా సభ్యులు కోరారు.

రాగులు కొనుగోలుకు కేంద్రం అనుమతి

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల నుంచి నవంబరు నుంచి జనవరి వరకు 17,000 టన్నుల రాగులు కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుదారులకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందజేస్తున్నారు. వాటితో కలిపి రాగులు కూడా ఉచితంగా ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పంపిణీని నీలగిరి, ధర్మపురి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి కార్డుదారులకు 2 కిలోల రాగులు ఇస్తున్నారు. ఇందుకోసం రైతుల నుంచి కనిష్ఠ ధరగా వంద కిలోలు రూ.4,290కి కొనుగోలు చేస్తోంది. రాగులు అధికంగా పండించే ధర్మపురి, కృష్ణగిరి, సేలం, ఈరోడ్ జిల్లాల్లో వచ్చే నెల నుంచి కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలు చేయాలని, రాగి సాగుపై రైతులకు అవగాహన కల్పించి, సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆహార భద్రతా శాఖ అధికారులు తెలిపారు.

టాస్మాక్ దుకాణాల్లో అదనపు కౌంటర్లు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ దుకాణాల్లో అదనపు కౌంటర్లు ఏర్పాటుచేయాలని టాస్మాక్ సంస్థ నిర్ణయించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న 4,829 టాస్మాక్ మద్యం దుకాణాల్లో 3,500 దుకాణాల్లో రోజువారీ విక్రయాలు రూ.2 లక్షలకు పైగా ఉన్నాయి. ఈ దుకాణాల వద్ద రద్దీ నియంత్రించేలా, దీపావళి పండుగ రోజున సులభంగా మద్యం కొనుగోలు చేసేలా అదనపు కౌంటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు టాస్మాక్ సంస్థ ప్రకటించింది.

ఇంజనీరింగ్ కళాశాలల్లో బీబీఏ, ఎంబీఏ కోర్సులకు స్టే

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో బీబీఏ, ఎంబీఏ కోర్సులపై స్టే విధిస్తూ అన్నా విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది. దేశంలో ఆర్ట్స్‌సైన్స్ కళాశాలల్లో బీబీఏ, ఎంబీఏ కోర్సుల నిర్వహణ ఏఐసీటీఈ అనుమతి పొందాల్సి ఉంది. కాగా, ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా ఈ కోర్సులు ప్రారంభించేందుకు ఏఐసీటీఈ అనుమతిచ్చింది. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ ప్రైవేటు కళాశాలలు, స్వయంప్రతిపత్తి కళాశాలలు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశాయి. ఈ కేసులన్నింటినీ ఒకటిగా విచారించాలని ఢిల్లీ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంబీఏ, బీబీఏ కోర్సుల ప్రారంభానికి ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈ విషయాన్ని అన్ని కళాశాలలకు తెలియజేయాలని కళాశాల విద్య కమిషనర్ సుందవల్లి సర్క్యులర్ జారీచేశారు.

ఆత్మహత్యకు దారి తీసిన కుటుంబ తగాదాలు

● పిల్లలకు విషమిచ్చి ఉరేసుకున్న తల్లి

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా కొండలంపట్టి పోలీసు క్వార్టర్స్‌లో నివసిస్తున్న గోవిందరాజ్ అనే కానిస్టేబుల్ భార్య సంగీత (34) తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గోవిందరాజ్ సేలం ప్రభుత్వ ఆస్పత్రి పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు రోహిత్ (7) అనే కుమారుడు, దర్శికాశ్రీ (5) అనే కుమార్తె ఉన్నారు. గోవిందరాజ్ డ్యూటీకి వెళ్ళి ఇంటికి లేటుగా వచ్చినప్పుడల్లా సంగీత అతడితో గొడవ పెట్టుకునేది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం పిల్లలకు, తనకు దీపావళికి దుస్తులు కొనివ్వాలని సంగీత అడిగింది. ఆ సందర్భంగా భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. గోవిందరాజ్ డ్యూటీకి వెళ్ళి రాత్రి తిరిగి రాగానే ఇంటిలో ఇద్దరు పిల్లలు శవాలుగా నేలపై పడి ఉన్నారు. సంగీత గదిలో ఉరిపోసుకుని వేలాడుతోంది. అది చూసి దిగ్భ్రాంతిచెందిన గోవిందరాజ్ కూడా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆలోగా స్థానికులు, బంధువులు ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

విద్యుదాఘాతంతో తమిళనాడువాసి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తమిళనాడువాసి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు కొళత్తూరుకు చెందిన దిలీప్ ఎలక్ట్రీషియన్. శ్రీకాళహస్తి పట్టణంలోని రెవెన్యూ కాలనీలో నిర్మాణంలో ఉన్న కొత్త ఇంటికి ఎలక్ట్రికల్ పనులు చేసేందుకు కొళత్తూరు నుంచి కొందరు యువకులతో వచ్చాడు. శుక్రవారం రాత్రి పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో దిలీప్ అక్కడికక్కడే కుప్పకూలాడు. సహచరులు దిలీప్‌ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీకాళహస్తి 1టౌన్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11వ అంతస్తు నుంచి జారిపడి పోలీసు మృతి

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లో 11వ అంతస్తు నుండి జారిపడి పోలీసు మృతిచెందాడు. ఆర్ఆర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ క్వార్టర్స్‌లో పోలీసు సెల్వకుమార్ ఎలక్ట్రీషియన్ పనులు చేపట్టాడు. 11వ అంతస్తులో పనులు చేస్తున్న సమయంలో కాలుజారి కింద ఉన్న పోలీసు వాహనంపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయన సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అలల్లో చిక్కుకొని

ఇద్దరు మహిళల మృతి

● మరో ముగ్గురు ఆస్పత్రికి తరలింపు

పెరంబూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా వేంపార్ సమీపంలో సముద్రపు అలల్లో చిక్కుకొని ఇద్దరు మహిళలు మృతిచెందగా, మరో ముగ్గురు మహిళలను రక్షించి తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విలాత్తికుళం సమీపం పెరియస్వామిపురంలో ఉన్న భద్రకాళి అమ్మవారి ఆలయ వేడుకలు కొద్దిరోజులుగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు. గురువారం వేడుకలు ముగిసిన నేపథ్యంలో, శుక్రవారం ఉదయం కొందరు ఆ ప్రాంతంలోని సముద్రంలో స్నానాలకు వెళ్లారు. ఆ సమయంలో వచ్చిన భారీ అలలకు ఐదుగురు మహిళలు గల్లంతయ్యారు. వారి కేకలతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు రక్షించి వేంపార్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. వారిలో మదురై జీఆర్ నగర్‌కు చెందిన ఇలక్కియ (21), కన్నియమ్మాళ్ (50) మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో చిక్కుకున్న కేరళకు చెందిన మురుగలక్ష్మి (38), మదురైకి చెందిన శ్వేత (22), అనిత (29) శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతుండడంతో వారిని తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సూరంకుడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తూత్తుకుడిలో బయో డీజిల్ స్వాధీనం

● ఇద్దరి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి చేపల రేవు వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.8లక్షల విలువైన బయోడీజిల్‌ను సముద్రతీర భద్రతాదళం స్వాధీనం చేసుకుంది. తూత్తుకుడిలో మరపడవలు నడిపే జాలర్లకు కొంతమంది స్మగ్లర్లు బయోడీజిల్ అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తూత్తుకుడి ఓడరేవుకు బయోడీజిల్ అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో సముద్రతీర భద్రతా దళం సీఐ పేచ్చిముత్తు నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. శుక్రవారం వేకువజాము తూత్తుకుడి చేపలరేవు వైపు వెళ్తున్న లారీ ఆపి సోదా చేశారు. ఆ లారీలో 65 ప్లాస్టిక్ బ్యారెళ్లలో రూ.8లక్షల విలువైన బయోడీజిల్ గుర్తించారు. లారీలో ఉన్న తూత్తుకుడి మిల్లర్‌పురానికి చెందిన కందన్, కేవికే నగర్‌కు చెందిన మణికంఠన్ అనే ఇరువురిని అరెస్టు చేశారు. లారీని కూడా స్వాధీనం చేసుకున్నారు.

రాజీవ్‌పై అనుచిత వ్యాఖ్యలు..

కోర్టు విచారణకు హాజరైన సీమాన్


విక్రవాండి కోర్టుకు వెళుతున్న సీమాన్

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో విక్రవాండి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం జరిగిన విచారణకు నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) నేత సీమాన్ హాజరయ్యారు. 2019లో విల్లుపురం జిల్లా నేమూరు గ్రామంలో జరిగిన బహిరంగ సభలోమాజీ ప్రధాని రాజీవ్ కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చేలా సీమాన్ ప్రసంగించారు. ఈ విషయమై విల్లుపురం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై విక్రవాండి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో గత కొంతకాలంగా విచారణ జరుగుతోంది.

రీల్స్ మోహంతో ఆడవేషంలో బైక్ రైడింగ్


ఆడవేషంతో బైకు నడుపుతున్న యువకుడు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేలూరులో రీల్స్‌పై మోజుతో ఓ యువకుడు ఆడవేషం ధరించి బైకును అత్యంత వేగంగా నడుపుతున్న దృశ్యాలతో ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ యువకుడు పొడవైన జడ, పూలు పెట్టుకుని వెనుక నుంచి చూస్తే అందమైన యువతిలాగే వేషం ధరించి ఆ బైకును వేలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో నడిపాడు. కాలేజీ విద్యార్థినులు తిరిగే ప్రాంతాల్లో ఆ బైకును ఒంటి చక్రంతో నడపటం, సైలెన్సర్ శబ్దం చేస్తూ సవారీ చేశాడు. ఇన్ని సాహసాలు చేసిన ఆ యువకుడు పోలీసులకు పట్టుబడతాననే ముందు జాగ్రత్త బైక్ నెంబర్ లేకుండా జాగ్రత్త పడ్డాడు. ప్రస్తుతం ఆడవేషంలో బైకును నడిపి అదరగొట్టిన ఆ యువకుడి ఆచూకీ కనుగొని శిక్షించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వీడియో ఆధారంగా అతడికోసం గాలిస్తున్నారు.

రౌడీలపై విమర్శలు..

పోలీసు కమిషనర్‌కు ఊరట

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రౌడీలకు సంబంధించి విమర్శలు చేసిన వ్యవహారంలో మానవహక్కుల సంఘం విచారణకు గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ నేరుగా హాజరుకావడాన్ని మినహాయిస్తూ హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. అరుణ్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు నగరమంతటా రౌడీల ఏరివేత ముమ్మరం చేస్తామని, వారి కుటుంబీకులను ఆయా పోలీసుస్టేషన్ల అధికారులు వెళ్ళి హెచ్చరికలు జారీ చేస్తామన్నారు. పోలీసు కమిషనర్ అరుణ్ సూచన మేరకు తిరువొత్తియూరులోని ఓ రౌడీ ఇంటికి వెళ్ళిన అసిస్టెంట్ కమిషనర్ ఇలంగోవన్ రౌడీ భార్యను తీవ్ర పదజాలంతో హెచ్చరించారు. ఆ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో రావడంతో రాష్ట్ర మానవ హక్కుల సంఘం సుమోటివ్‌గా కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించింది. తాము పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలంటూ ఆదేశించింది. దానిని వ్యతిరేకిస్తూ కమిషనర్ అరుణ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు విచారణ జరిపి నగర పోలీసు కమిషనర్ అరుణ్ మానవహక్కుల సంఘం ఎదుట విచారణకు హాజరుకాకుండా ఉండేలా మినహాయింపు ఉత్తర్వు జారీ చేసింది.

ప్రైవేట్ నీట్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు బడితపూజ

● మానవహక్కుల సంఘం విచారణ



ఓ విద్యార్థిని బెత్తంతో కొడుతున్న అధ్యాపకుడు (సీసీ ఫుటేజీ) - సంస్థ నిర్వాహకులు, విద్యార్థులను విచారిస్తున్న రాష్ట్ర మానవహక్కుల సంఘం సభ్యులు

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరంలోని ప్రైవేటు నీట్ శిక్షణా కేంద్రంలో విద్యార్థులను బెత్తంతో కొట్టడం, వారిపై చెప్పులు విసరడం వంటి సంఘటనలపై రాష్ట్ర మానవహక్కుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం ఆ శిక్షణా కేంద్రంలో ఆ సంఘం సభ్యులు జస్టిస్ వి.కన్నదాసన్ విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేరళకు చెందిన ప్రముఖ శిక్షణా సంస్థలో శిక్షకుడిగా పనిచేసిన జలాలుద్దీన్ అహమ్మద్ వెట్టియాడన్ రెండేళ్ల క్రితం తిరునల్వేలిలో 'జల్' పేరుతో నీట్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన కొంతమంది విద్యార్థులు నీట్‌లో ఉత్తీర్ణులై ప్రభుత్వ వైద్యకళాశాలల్లో అడ్మిషన్లు పొందినట్లు ఆ సంస్థ ప్రకటనలు గుప్పించింది. దీంతో ఆ శిక్షణా కేంద్రంలో రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఫీజులున్నా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణ కోసం పంపించారు. అయితే ఆ శిక్షణా కేంద్రంలో పాఠాలు బోధించే అధ్యాపకులు విద్యార్థులను చిత్రహింసలు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ శిక్షణా కేంద్రాన్ని రోజూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ నడుపుతూ, ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ ఆఖరున ఉదయం పరీక్ష రాసి అలసిపోయిన విద్యార్థులు కొందరు మధ్యాహ్నం పరీక్షకు సిద్ధమవుతూ కాస్త కునుకు తీశారు. అది చూసిన అధ్యాపకుడొకరు ఆగ్రహంతో బెత్తం పట్టుకుని కునుకు తీసినవారిని పిలిచి వారిని చితకబాదారు. అంతటితో ఆగకుండా పాఠాలపై దృష్టిసారించని విద్యార్థినులపై చెప్పులు విసిరారు. దీనికి సంబంధించి ఎవరో సెల్‌ఫోన్‌లో తీసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ వీడియో ఆధారంగా తిరునల్వేలి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అదే సమయంలో శుక్రవారం ఉదయం రాష్ట్ర మానవ హక్కుల సంఘం సభ్యులు జస్టిస్ కన్నదాసన్ ఆ శిక్షణా కేంద్రానికి వెళ్ళి విద్యార్థుల వద్ద విచారణ జరిపారు. ఆ శిక్షణా కేంద్రంలో విద్యార్థులపట్ల సంస్థ నిర్వాహకుడు జలాలుద్దీన్ అసభ్యంగా ప్రవర్తిస్తూ నానా దుర్భాషలాడుతున్నారని, బెత్తంతో కొట్టడమే ఆనవాయితీగా పెట్టుకున్నాడని, విద్యార్థినులపై చెప్పులు విసిరివేసేవాడని విద్యార్థులంతా జస్టిస్ కన్నదాసన్‌కు ఫిర్యాదులు చేశారు.



'బ్లాక్' సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

సక్సెస్ మీట్ చూసి చాలా రోజులైంది

● హీరో జీవా

తన చిత్రాలకు సంబంధించి విజయోత్సవ వేడుకలు జరుపుకుని చాలా రోజులైందని హీరో జీవా అన్నారు. అతను హీరోగా నటించిన 'బ్లాక్' చిత్రం ఈ నెల 11న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్ వేడుకలను గురువారం రాత్రి నగరంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న హీరో జీవా మాట్లాడుతూ సక్సెస్ మీట్ చూసి చాలా రోజులైందని, గత ఐదేళ్ళుగా ఒకే లుక్‌లో ఉన్నాను, ఈ చిత్రంలో స్పెషల్ లుక్‌లో కనిపించడం ఆనందంగా ఉందన్నారు. ప్రేక్షకులకు నచ్చుతుందన్న నమ్మకంతో ఈ చిత్రానికి కమిట్ అయ్యాను. అనుకున్నట్టుగానే సక్సెస్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శితమవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. నిర్మాత ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ, 'సూపర్‌స్టార్ రజనీకాంత్ 'వేట్టయన్' చిత్రం విడుదలైన మరుసటి రోజే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి కారణం.. ప్రేక్షకులపై ఉన్న నమ్మకమే. గతంలో తాము నిర్మించిన అనేక చిత్రాలను విజయవంతం చేశారన్నారు. దర్శకుడు జీకే బాలసుబ్రమణి మాట్లాడుతూ, 'కోలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో పొటెన్షియల్ ఒకటి. ఈ సంస్థకు ఉన్న పేరు చెడగొట్టకూడదనే సంకల్పంతో 'బ్లాక్' చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. ప్రేక్షకులు కూడా తాము ఊహించినట్టుగానే సక్సెస్ చేశారు. పాజిటివ్ రివ్యూలు రాసిన మీడియాకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు. సినిమాలో ఏముందో చూడాలన్న ఆసక్తిని ప్రేక్షకుల్లో మీడియా రేకెత్తించింది. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్క టెక్నీషియన్ ఎంతో శ్రమించారు. వారందరికీ ఆయన కృతజ్ఞతలు' తెలిపారు.

సంగీత దర్శకుడిగా బాంబే జయశ్రీ కుమారుడు

● 'సిద్ధార్థ్-40' చిత్రంతో ఎంట్రీ



అమృత్ రామనాథ్

ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి బాంబే జయశ్రీ కుమారుడు అమృత్ రామ్‌నాథ్ మ్యూజిక్ డైరెక్టరుగా కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే అనేక ఆల్బమ్స్ రూపొందించిన అమృత్... ఇపుడు హీరో సిద్ధార్థ్ నటిస్తున్న 40వ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ విషయంపై అమృత్ రామ్‌నాథ్ మాట్లాడుతూ, 'సంగీత దర్శకుడిని కావాలనే కోరిక చిన్నప్పటి నుంచి ఉండేది. బాల్యం నుంచి సంగీతం కోసం అధిక సమయాన్ని వెచ్చించాను. కర్ణాటక సంగీతం, ప్రాశ్చాత్య సంగీతాన్ని అమ్మతో కలిసి ఆలపించాను. విద్యాభ్యాసం పూర్తయ్యాక ఫుల్‌టైమ్ మ్యూజిక్ డైరక్టర్ కావాలన్న ఏకైక లక్ష్యంతో సంగీత కళాశాలలో చేరాను. ఇప్పటివరకు 25 ఆల్బమ్స్ రూపొందించాను. తమిళంలో సిద్ధార్థ్ చిత్రానికి సంగీతం సమకూర్చే అవకాశం దక్కింది. ఈ సినిమా కోసం కొన్ని ట్యూన్స్ ప్రయోగించబోతున్నాను. నా తొలి తమిళ చిత్ర సంగీతం ప్రేక్షకులకు నచ్చితే అంతకంటే అదృష్టం మరొకటి ఉండదు. ఇళయరాజా సంగీతాన్ని కలలో కూడా ఊహించలేం. ఆయన పాటలు విడుదలై కొన్ని సంవత్సరాలు గడిచిపోతున్నా ఇప్పటికీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఏఆర్.రెహ్మాన్ తన స్వరాలతో సంగీత సరిహద్దులను చెరిపివేశారు. అనిరుథ్ సంగీతంలో ఏదో గమ్మత్తు ఉందంటూ అభిమానులు సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. ఇలా ఒక్కో సంగీత దర్శకుడిలో ఒక్కో రకమైన ప్రతిభ దాగివుంటుంది. అందువల్ల ఒకరిని మరొకరితో పోల్చడం సరి కాదు' అన్నారు.



చిత్రజ్యోతి

హీరో సూర్యకు జోడీగా కాశ్మీరా పర్దేశి

బాలీవుడ్ భామ కాశ్మీరా పర్దేశితో హీరో సూర్య రొమాన్స్ చేయనున్నారు. తాను నటించే 45వ చిత్రంలో ఈమెను హీరోయిన్‌గా తీసుకునే అంశంపై సంప్రదిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం సూర్య హీరోగా చిరుత్తై శివ 'కంగువా' చిత్రంలో నటించగా, నవంబరు 14వ తేదీ ఈ చిత్రం విడుదలకానుంది. అలాగే, కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 44వ చిత్రంలో నటించిన సూర్య, ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తన 45వ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవలే అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా కాశ్మీరా పర్దేశిని తీసుకునేందుకు వీలుగా చర్చలు జరుపుతున్నారు. ఈమె గతంలో 'సివప్పు మంజల్ పచ్చై', 'అన్బరివు', 'పరంపొరుల్', 'పీటీ సార్' వంటి చిత్రాల్లో నటించారు.

నిర్మాతగా డాక్టర్ అన్బుమణి కుమార్తె



సంఘమిత్ర

పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ కుమార్తెల్లో ఒకరైన సంఘమిత్ర సినీ నిర్మాతగా మారారు. ఆమె నిర్మాణ సారథ్యంలో 'అలంగు' అనే పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ చిత్రం ఫస్ట్ సింగిల్‌ను అగ్ర నటుడు కమల్ హాసన్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ప్రముఖ కంపెనీ సరిగమ సొంతం చేసుకుంది. గిరిజన వలస కూలీల జీవన సిత్రాలతో ఎస్పీ శక్తివేల్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. ఈయన గతంలో 'ఉరుమీన్' అనే చిత్రాన్ని రూపొందించారు. కాగా, డాక్టర్ అన్బుమణి - సౌమ్యలకు సంఘమిత్ర, సంయుక్తా, సంచిత్ర అనే ముగ్గురు కుమార్తెలు న్నారు. వీరిలో పెద్ద కుమార్తె సంఘమిత్ర నిర్మాతగా మారారు.



డా.మీరా నారాయణన్



కళాసేవకు విశ్రాంతి లేదు

సాధారణంగా వృత్తిలో కొనసాగినంతకాలం ప్రవృత్తిపై దృష్టి సారించడం కష్టమైన పనే. ప్రవృత్తి పట్ల ఎంత ఆసక్తి ఉన్నా వృత్తి నిర్వహణ, కుటుంబ బాధ్యతలు, సమయాభావం మొదలైన కారణాలతో ఎంతోమంది వృత్తిలో ఉన్నంత కాలం ప్రవృత్తులకు కామానో, ఫుల్‌స్టాపో పెడుతుంటారు. అయితే వీటన్నిటినీ అధిగమించి వృత్తితో సమాంతరంగా ప్రవృత్తిని కూడా కొనసాగించే వారూ లేకపోలేదు. అలాంటి వారిలో ఒకరు మీరా నారాయణన్. ఆమె వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు. ప్రకృత్తి కళాకారిణి. భరత నాట్య కళాకారిణి, వైణికురాలు, గాయకురాలు, ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తూనే, తన ప్రవృత్తులను పండించుకున్న డా.మీరా నారాయణన్ జీవన నేపథ్యం నేటి మన 'తరుణి'లో -వేళచ్చేరి

● వృత్తి, ప్రవృత్తుల మేళవింపు
● సంగీత, నాట్యాల్లో రాణింపు
● రత్నగిరి నటనామణి డాక్టర్ మీరా నారాయణన్



వైణికురాలిగా....

మీరా జన్మించింది చెన్నైలో. తెలుగు కుటుంబమే అయినా కొన్ని తరాలుగా తమిళనాట స్థిరపడిన వారసత్వం ఆమెది. అయినా ఇంట్లో తెలుగు మాట్లాడుకోవడం వల్ల వారి కుటుంబాలలో తెలుగు జీవించే ఉంది. మీరా తండ్రి డైమండ్ వ్యాపారి. తల్లి గృహిణి. చెన్నైలోని లార్డ్స్ గర్ల్స్ హైస్కూలులో మీరా ఎస్.ఎస్.ఎల్.సీ చదివారు. ఆ పైన సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ చేసి తను చదువుకున్న స్కూలులోనే టీచర్‌గా చేరారు. రెండేళ్లు పనిచేసిన అనంతరం పెరంబూర్ కార్పొరేషన్ స్కూలులో ఉపాధ్యాయురాలుగా చేరి ప్రధానోపాధ్యాయురాలిగా పదవీవిరమణ చేశారు.



పిల్లలకు వీణా వాదన శిక్షణలో...

కళాకారుల కుటుంబం...

మీరాది సంగీతం నేపథ్యంగా కలిగిన కళాకారుల కుటుంబం. ఆమె తాత మృదంగ విద్వాంసులు, తల్లి హార్మోనియంపై రాగాలు పలికించేవారు. గాయని కూడా. బాల్యం నుండే మీరాలో సంగీతం పట్ల అభిరుచి కలిగింది. తల్లే ఆమె ప్రథమ గురువు. అన్నామలై యూనివర్సిటీ నుంచి సంగీతంలో బీఏ చేశారు మీరా. చిన్నతనంలోనే పాటకు తగినట్లు అభినయం చేస్తున్న మీరా అభిరుచిని గమనించి ప్రఖ్యాత భరతనాట కళాకారుల వద్ద ఆమెకు శిక్షణ ఇప్పించారు. కృష్ణా మ్యూజిక్ స్కూలులో పదేళ్లపాటు నాట్యం, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు మీరా. కర్ణాటక సంగీతంలో అనుభవం వచ్చిన తరువాత స్వంతంగా వీణ నేర్చుకున్నారు. నాట్యం, సంగీతం, వీణా వాదన పరీక్షల్లో కృతార్థురాలు కావడమే కాక, వీణలో డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారు.

ఉద్యోగం చేస్తూ...కళా కేంద్రం

'ఉత్తమ ఉపాధ్యాయులు' అవార్డు అందుకున్న ఆమె తాను పనిచేసిన అన్ని చోట్లా సాంస్కృతిక కార్యక్రమాలు ముందుండి నడిపించేవారు. ఒక వైపు వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తూ, మరోవైపు తన ప్రవృత్తిని పండించుకొనే ప్రయత్నంలో నాట్య, సంగీత పాఠశాలకు రూపకల్పన చేశారు. పెరంబూర్‌లో 'సరస్వతి కళా కేంద్ర' అనే ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ప్రారంభించారు. భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం, వీణ నేర్పిస్తూ ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దారు మీరా. తన విద్యార్థులకు తిరుచ్చి, చిదంబరం మొదలైన దేవాలయ నాట్యోత్సవాల్లో పాల్గొనే అవకాశం కలిగించారు. ప్రభుత్వ సంస్థల నిర్వహణలో చెన్నై, ఢిల్లీలో కూడా ఆమె విద్యార్థులు నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. మీరా తను స్థాపించిన స్కూలు ద్వారా ఎంతోమందికి సంగీతం, నాట్యంలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఆమె దగ్గర నాట్యంలో శిక్షణ పొందిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థితిలో ఉన్నారని, సొంతంగా డాన్స్ స్కూల్స్ కూడా నడుపుతున్నారని మీరా తెలిపారు. ఆమె చేసిన సేవలకు కోయంబత్తూర్‌లోని 'అకాడమీ ఆఫ్ యూనివర్సల్ పీస్' అనే సంస్థ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వృత్తి జీవితంలోనే, తన ప్రవృత్తిని అనుసరించి సరస్వతి కళా కేంద్రం స్థాపించి ఎంతోమందికి శిక్షణ ఇచ్చారు. కొట్టివాక్కంలో 'నృత్య వృక్ష' అనే డ్యాన్స్ స్కూల్ కూడా ప్రారంభించి ఎన్నో ఏళ్ల తరువాత దాని బాధ్యతను తన చిన్న కుమార్తెకు అప్పగించారు. పదవీ విరమణ తరువాత మీరా తన ప్రవృత్తిలో కొనసాగుతున్నారు. వయోభారం వలన నాట్య శిక్షణ పర్యవేక్షణ మాత్రమే చేస్తున్న మీరా, వీణలో మాత్రం ఇంకా పాఠాలు చెబుతూనే ఉన్నారు.

కుటుంబ నేపథ్యం....

మీరా భర్త నారాయణన్. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారు కూడా నాట్యంలో ఆమె శిష్యులే. అంతేకాదు, డాక్టరైన ఆమె మనవడు కూడా ఒకప్పుడు ఆమె దగ్గర నాట్యం అభ్యసించినవాడే. కళ వారసత్వంగా గల మీరా కుటుంబంలో ప్రస్తుతం అయిదో తరానికి చెందిన ఆమె మనవరాలు కూడా తను స్థాపించిన స్కూల్‌లో నృత్య శిక్షణ ఇస్తూ, ఎన్నో కార్యక్రమాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.



ఆత్మీయ సత్కారం అందుకుంటూ...

అవార్డులు:

టీచర్‌గా పనిచేసే సమయంలో ఆమె సమర్థతకు గుర్తింపుగా ప్రభుత్వం 'బెస్ట్ టీచర్' అవార్డు ప్రదానం చేసింది. ఇక ఆమె నాట్యంలో అందుకున్న అవార్డులు, సన్మానాలు చాలానే ఉన్నాయి. 'నాట్యకురిసిల్', 'రత్నగిరి నటనామణి', 'నల్లపెన్మణి', 'సేవై ఇలాగమ్' మొదలైన ఎన్నో అవార్డులను పొందారు మీరా. ఉద్యోగ విరమణానంతరం కూడా ఇప్పటికీ ఎన్నో పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలలో పాటలు, డాన్స్ నేర్పించడంలో చేయూతనందిస్తున్నారు.



నటి సీత, పిల్లలకు భరత నాట్య శిక్షణ ఇస్తూ...

"కళలకు లింగవివక్షత లేదు. ఆసక్తి ఉన్న ఆడపిల్లలు, మగపిల్లలు అందరూ నేర్చుకోవచ్చు. మా కళాకేంద్రంలో ఎంతో మంది మగపిల్లలకి కూడా నాట్యంలో శిక్షణ ఇచ్చాను. నా పెద్ద మనవడు, మనవరాలికి నాట్యం, నా చిన్న మనవడికి సంగీతం నేర్పించాను. కళను శ్రద్ధగా నేర్చుకొని, నిబద్ధతతో అభ్యాసం చేయాలి. నిరంతరం సాధన చేస్తూ ఉంటేనే కళల్లో రాణించగలుగుతారు". అని 'తరుణి'తో తన మనోభావాలను పంచుకున్నారు మీరా ...

నేటినుంచి లూప్ రోడ్డు మార్కెట్లోనే చేపల విక్రయాలు

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట మండలం మెరీనా లూప్ రోడ్డులో రూ.14.93 కోట్లతో నిర్మించిన అధునాతన మార్కెట్‌లోనే శనివారం నుంచి చేపల విక్రయాలు జరుగుతాయని చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. రెండెకరాల విస్తీర్ణంలో 360 దుకాణాలతో ఏర్పాటుచేసిన ఈ మార్కెట్లో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ వసతి ఉందన్నారు. చేపల కొనుగోలు వచ్చే వారు తమ వాహనాలను రోడ్ల పక్కన కార్లు నిలుపకుండా నిర్ణయించిన ప్రాంతంలోనే పార్కింగ్ చేయాలని, వ్యాపారులు కూడా రోడ్లపై చేపల విక్రయాలు చేపట్టరాదని కార్పొరేషన్ తెలియజేసింది.

ఆవిన్ నుంచి దీపావళికి స్వీట్లు

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక స్వీట్లు, కారం రకాలు అందిస్తున్నట్లు ఆవిన్ ప్రకటించింది. గత ఏడాది పండుగ సందర్భంగా ఆవిన్ అందించిన స్వీట్లు ప్రజలు ఆదరించారని, ఈ ఏడాది 20 శాతం అదనపు విక్రయాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ పండుగ సందర్భంగా ఖాజా పిస్తా రోల్, ఖాజా కట్లీ, నెయ్యి బాదుషా, జీడిపప్పు హల్వా, మిక్సర్, మురుకులు తదితరాలు అందించనున్నామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఆవిన్ స్వీట్లు, కారం రకాలు కొనుగోలు చేయాలని ఆవిన్ విజ్ఞప్తి చేసింది.

ఉదయనిధిని డ్రెస్‌కోడ్ పాటించాలని చెప్పండి

● మద్రాసు హైకోర్టులో పిటిషన్

ప్యారీస్, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే సమయంలో డ్రెస్ కోడ్ పాటించేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై న్యాయవాది సత్యకుమార్ దాఖలుచేసిన పిటిషన్‌లో.. 2019 జూన్ 1వ తేది జారీ చేసిన నెం.67 ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగులు శుభ్రమైన దుస్తులు ధరించాలని ఉందన్నారు. ఆ జీవో ప్రకారం, పురుష ఉద్యోగులు తమిళ సంప్రదాయం, దేశ పారంపర్యం తెలియజేసేలా ఫార్మల్ డ్రస్, ప్యాంట్, పంచె ధరించాలన్నారు. కానీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రభుత్వ కార్యక్రమాల్లో టీ-షర్ట్ వేసుకుని హాజరవుతున్నారని, రాష్ట్ర సచివాలయం మార్గదర్శకాలను మంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయన పాటించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో ఉదయనిధి వేసుకున్న టీ-షర్ట్‌పై డీఎంకే చిహ్నం ఉంటుందని, ప్రజా ప్రతినిధులు అన్న కోణంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే సమయంలో ఒక పార్టీ చిహ్నం వినియోగించే విధానంపై స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు.



పెరియకుళం చెరువులో తేలియాడుతున్న సోలార్ ప్యానెళ్లు

రాష్ట్రంలోనే తొలిసారిగా నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్

● కోవైలో ఏర్పాటు ● వినూత్న పద్ధతిలో విద్యుదుత్పత్తి

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొదటిసారిగా వాణిజ్యనగరమైన కోయంబత్తూరులో చెరువుపై తేలియాడే సోలార్ ప్యానెళ్లతో విద్యుత్ ఉత్పత్తి చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నమక్కునామే పథకం కింద రూ.1.45 కోట్లతో జర్మన్‌కు చెందిన సంస్థతో కలిసి కోయంబత్తూరు కార్పొరేషన్ ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఆ నగరంలోని ఉక్కడం పెరియకుళం చెరువులో అర ఎకరా విస్తీర్ణంలో సోలార్‌ప్యానెళ్లను లంగరు వేసే పద్ధతి (ఆంకరింగ్ మెథడ్)లో తేలియాడేలా అమర్చారు. ఆ సోలర్ ప్యానెళ్లకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. 24 గంటల కాపలాకు సిబ్బందిని కూడా నియమించారు. ఈ సోలార్ ప్యానెళ్ల ద్వారా రోజూ 154 కె.వి విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని కోయంబత్తూరు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. మరో రెండు నెలల్లోగా అన్ని పనులు పూర్తయిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఎంపిహెచ్‌ఏ 34వ వ్యవస్థాపక దినోత్సవం

అడయార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హెయిర్ పర్చేజ్ అసోసియేషన్ (ఎంపిహెచ్‌ఏ) 'ఫిన్‌కాన్ 2024' పేరుతో 34వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నగరంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేష్ రవిశంకర్ ముఖ్యఅతిథిగా, ఐఏఎస్ అధికారి డాక్టర్ సీకే గరియాలి ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. వీరితో పాటు ఎఫ్ఐహెచ్‌పీఏ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మెహతా, ఎంపిహెచ్‌ఏ ప్రెసిడెంట్ అజయ్ నహర్, ఎంపిహెచ్‌ఏ కోశాధికారి సుధీర్ నూన్‌వాల్ బోరా అండ్ కన్వెన్షన్ చైర్మన్ దిలీప్ చందన్ తదితరులు పాల్గొన్నారు. కాగా 1991లో ప్రారంభమైన ఎంపిహెచ్‌ఏకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హెయిర్ పర్చేజ్ గుర్తింపు ఉంది. ఇందులో దాదాపు 1400 మంది సభ్యులున్నారు. గత మూడు దశాబ్దాలుగా దేశ పరిశ్రమ రంగానికి విశేషమైన సేవలు అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఫిన్‌కాన్ 2024 పేరుతో రెండు రోజుల పాటు ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది.



వేడుకల్లో నిర్వాహకులు

వైగై డ్యామ్ నుంచి మళ్లీ సాగునీరు విడుదల

చెన్నై, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వైగై డ్యామ్‌లో నీటిమట్టం పెరిగింది. దీంతో ఆ డ్యామ్ నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్నారు. పంటల సాగు కోసం 800 ఘనపుటడుగుల చొప్పున, మదురై కార్పొరేషన్ పరిధిలో తాగునీటి అవసరాల కోసం 69 ఘనపుటడుగుల చొప్పున డ్యామ్ నుండి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆ డ్యామ్‌లో 56.79 అడుగుల నీటిమట్టం ఉంది.



వైగై డ్యామ్ నుంచి విడుదలవుతున్న జలాలు



పండగ సెలవు కోసం..

నరక చతుర్దశిని అధికారిక సెలవుదినంగా ప్రకటించాలన్నది ఈ విద్యార్థుల వినతి. దీనికోసం తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టుకార్డులను చూపారు. వీటిని సీఎం చంద్రబాబుకు పంపనున్నట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల తెలిపారు. గత వైసీపీ పాలనలో హిందూ వ్యతిరేకతతో పండుగ సెలవును రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ సెలవును పునరుద్ధరించాలని కోరారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎలా పోవాలబ్బా?

వాహనం వస్తే దిగబడుతుంది. ద్విచక్ర వాహనమైతే జారుతుంది. ఇలాంటి రోడ్డులో ఎలా పోవాలబ్బా అంటూ ఆవేదన చెందుతున్నారు ఏర్పేడు మండలం పాగాలి గ్రామస్తులు. శ్రీకాళహస్తి రోడ్డులో నుంచి ఆ ఊరు వెళ్లే 2.5 కిలోమీటర్లు ఇదే పరిస్థితి. 2019కి ముందు టీడీపీ హయాంలో రోడ్డుకు భూమి పూజ చేసినా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. దీంతో వర్షమొస్తే నడకయాతన తప్పడం లేదంటున్నారు స్థానికులు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి





బాక్స్ క్రికెట్! కుమ్మేసుకోవచ్చు

గేమ్స్ అంటే ఈతరం పిల్లలు మొబైల్‌లో ఆడుకునేవి అనుకుంటారు. ప్రభుత్వ బడుల్లో మైదానాలు అంతరించిపోయి, ఆటస్థలాలు లేని ప్రయివేటు బడుల హవా మొదలయ్యాక ఏర్పడిన దౌర్భాగ్యం ఇది. గుడ్డిలో మెల్లలా క్రికెట్ ఆట ఒక్కటీ ఈతరం పిల్లలను ఆకర్షిస్తూనే ఉంది. ఆసక్తి ఉన్నా, సమయం కుదుర్చుకున్నా ఆడుకునేదానికి స్థలాలు ఏవీ? రియల్‌ఎస్టేట్ కబళించేసిన నగరాల్లో ఇదో పెద్ద సమస్య. ఇందుకు విరుగుడుగా పరిమిత స్థలంలోనే క్రికెట్ ఆడుకునే, నేర్చుకునే మైదానాలు మొదలయ్యాయి. దీన్నే బాక్స్ క్రికెట్ అంటున్నారు. తిరుపతిలో ఆరు బాక్స్‌క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయి. గంటకి ఇంతని అద్దె చెల్లించి వీటిలో ఆడుకోవచ్చు. గెస్ట్‌లైన్‌రోడ్డు(అన్నమ్య మార్గ్)లో కొత్తగా సామ్స్ క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో 2 క్రికెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. యువత టీంలుగా గానీ, కుటుంబాలుగా గానీ ఆడుకోవచ్చు. కాకపోతే ముందుగా టైంస్లాట్ బుక్ చేసుకోవాలి.

- తిరుపతి (జీవకోన)





ప్రత్యేకతలు:

ఈడ్చి కొడితే బాల్ పక్కింటి కిటికీ అద్దాలు బద్దలు చేస్తుందనే భయం లేదు. బాక్స్‌లైవ్ నెట్ బాల్‌ను బయటకు వెళ్లనివ్వదు.
రాత్రి వేళల్లోనూ ప్రత్యేక లైట్ల వెలుగులో క్రికెట్ ఆడుకోవచ్చు.



అద్దె ఎంత?:

పగలైతే గంటకు రూ.650.
రాత్రి అయితే రూ.850.
(15శాతం దాకా డిస్కౌంట్ వెసులుబాటు ఉంది)
వివరాలకు: 9059268386



ముగింపు దశలో ముక్కంటి ఆలయ లీకేజీ పనులు

● దాతృత్వం చాటుకున్న పుణె వ్యాపారి

శ్రీకాళహస్తి, అక్టోబరు 18: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు లీకేజీని అరికట్టే పనులు ముగింపు దశగా వచ్చాయి. కొద్ది సంవత్సరాలుగా ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ ఏర్పడటంతో సమస్య నెలకొంది. మైసూరులోని జాతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయ లీకేజీలపై స్పందించారు. పుణెకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు వెంకటేశ్వరరావును లీకేజీ పనులను చేపట్టాల్సిందిగా సూచించారు. దీంతో ఏడాది క్రితం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో పలుదఫాలుగా అధ్యయనం చేయించారు. అత్యంత శాస్త్రీయమైన పురాతన శైలిలో పైకప్పునకు మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం దాత పనులు ప్రారంభించారు. నిపుణుల పర్యవేక్షణలో సున్నం, ఇటుకలపొడి, ఇటుక ముక్కలు, ప్రకృతిలో సహజసిద్ధంగా మొక్కల నుంచి సేకరించిన బంక, కరక్కాయపొడి తదితర మిశ్రమాలతో పనులు చేపట్టారు. సుమారు రూ.5కోట్లతో చేపట్టిన ఈ పనులు తుదిదశకు చేరాయి. ఆయన కృషి ఫలితంగా ఇటీవల నాలుగు రోజుల పాటు ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసినప్పటికీ ఎక్కడా లీకేజీ కనపడలేదు.





పంచాయతీ పరిధిలో జీప్లస్ టూ వరకే నిర్మించాలి. ఆపై కట్టాలంటే తుడా అనుమతి తీసుకోవాలి. అలాగని ఈ ప్రాంతంలో భవంతుల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే.. తుడా అనుమతివ్వదు. ఎందుకంటే ఇది హాథీరాంజీ మఠం భూములు. అయినా, నిబంధనలకు విరుద్ధంగా తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ తిరుమలనగర్‌లోని మఠం భూముల్లో కళ్లు చెదిరే బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు.

మఠం భూముల్లో బహుళ అంతస్థులు

● నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు



గాంధీపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 13 లో దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో మఠం భూమిఉంది. ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ తరహా పలు అపార్టుమెంట్లు, పెద్దపెద్ద నివాస భవంతులను నిర్మిస్తున్నారు. గతంలో ఈ భూమిని పలువురు రైతులు మఠం నుంచి 99 సంవత్సరాలకు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేసేవారు. తమకు సాగు అనుభవం ఉండడంతో అప్పట్లో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించి రిజిస్ట్రేషన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తర్వాతకాలంలో హైకోర్టు ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టకుండా ఉత్తర్వులను రద్దు చేసినట్లు సమాచారం. ఈసీలో కూడా ఇప్పటికీ హాథీరాంజీమఠం భూమిగానే నమోదై ఉంది. ఈ స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీకి అనుమతిచ్చే అధికారం లేదు. అయితే నీరు, లైట్లు, రోడ్లు పంచాయతీవి కావడంతో కొంత మంది నుంచి గతంలో డెవలప్‌మెంట్ ట్యాక్స్ కట్టించుకున్నట్లు తెలిసింది. ఈ భూమిలో తొలుత రేకులషెడ్లు నిర్మించుకున్న కొందరు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితో ఒత్తిడి తెచ్చి పంచాయతీ డెవలప్‌మెంట్ ట్యాక్స్‌తోపాటు విద్యుత్ మీటర్లనూ తీసుకున్నారని సమాచారం. అదే స్థలంలో పెద్ద భవంతులు నిర్మించాక నాల్గైదేళ్లుగా ఎటువంటి రివైజ్డ్ ట్యాక్స్ కూడా చెల్లించని పరిస్థితి ఉంది. ఇప్పటికీ ట్యాక్స్ రూపంలో పలువురు వేలాదిరూపాయలు బకాయి ఉన్నారు. దీనికి తోడు కొత్తగా చేపట్టిన దాదాపు 40శాతం వరకు నిర్మాణాలకు ఇప్పటికీ పూర్తిగా పంచాయతీ ట్యాక్స్ కూడా చెల్లించలేదని తెలిసింది. తిరుపతినగరపరిధి దాదాపుగా రూరల్‌మండలం వరకు విస్తరించడంతో ఈభూములకు విపరీతమైన డిమాండు ఉంది. దీంతో రైతులు మఠం వద్ద కౌలుకు తీసుకున్న ఈ భూములను పలువురికి విక్రయాలు చేపట్టారు. రైతుల నుంచి పలువురు ఈభూములను కొనుగోళు చేసి భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. మఠం భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాల అప్రూవల్‌కు అవకాశమే లేదు. అయితే ఈభూమిలో వివిధ రంగాలకు(రాజకీయ, రెవెన్యూ, పోలీసు తదితర) చెందిన వారు నిర్మాణాలు చేపట్టడంతో మఠం, పంచాయతీ అధికారులు ఇటువైపు చూడటం లేదు. అదే పేదలు ఎక్కడో మారుమూల రెండుసెంట్ల స్థలం కొనుగోళు చేసి నిర్మాణాలు చేపడితే వెంటనే వచ్చి కూలదోసే మఠం అధికారులు విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆపార్టీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నేతల కన్ను ఈభూమిపై పడింది. ఇతరుల అధీనంలో ఉన్నభూమిలో దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమణలకు దిగుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

'పులికాట్'లో ఒరిగిన టవర్



నిటారుగా నిలబడాల్సి ఈ విద్యుత్తు టవర్.. ఏడాది ఒరిగిపోయి ఉంది. ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కోసం పులికాట్ సరస్సులో రెండు టవర్ల ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి గతేడాది మీచౌంగ్ తుఫాన్ సమయంలో వీచిన గాలులకు పక్కకు ఒరిగిపోయింది. అప్పట్నుంచి అలా.. ఉండిపోయింది. ఇటీవల వాయుగుండం ముప్పు తప్పింది కాని.. పెనుగాలులు వీచుంటే ఈ టవర్ నేలవాలేదే. ఇప్పుడు వానలు.. తుఫాన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో విద్యుత్తు టవరు కిందకు ఒరిగిపోతే ప్రమాదమే. మరోవైపు ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కూడా నిలిచిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ టవర్‌ను స్థిరంగా నిలబెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- తడ, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.96 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక గురువారం 58,637 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



ఒ.పన్నీర్‌సెల్వం

అసలుసిసలు నమ్మక ద్రోహి మీరే

● ఈపీఎస్‌పై ఓపీఎస్ ధ్వజం

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీకి సాయం చేసిన వాళ్లందరికీ వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఎడప్పాడి పళనిస్వామి అని, అసలు సిసలు నమ్మకద్రోహి ఆయనేనని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన చేస్తున్న ద్రోహం కారణంగా పార్టీ పతనావస్థకు చేరుకుందని ఓపీఎస్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించాలన్న లక్ష్యంతో ఎంజీఆర్ స్థాపించిన అన్నాడీఎంకే, ఆయన నాయకత్వంలో మూడు సార్లు అధికారం చేపట్టిందన్నారు. ఎంజీఆర్ మరణానంతరం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని జయలలిత నేతృత్వంలో అన్నాడీఎంకే, నాలుగు సార్లు అధికారం చేపట్టిందని తెలిపారు. ఆమె మరణానంతరం ద్రోహుల చేతుల్లోకి వెళ్లిన పార్టీ నేడు పతనావస్థలో ఉందన్నారు. ద్రోహుల కారణంగా 40 శాతం ఉన్న అన్నాడీఎంకే ఓటు బ్యాంక్ 20 శాతానికి పడిపోయిందన్నారు. కార్యకర్తల అండతో పార్టీకి పూర్వ వైభవం రప్పించి, 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ సమష్టిగా శ్రమించి పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చి, దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత బాటలో ప్రజా పాలన అందించేలా కృషిచేయాలని ఓపీఎస్ పిలుపునిచ్చారు.

పెంపుడు పిల్లి సాహసం.. జనం ఆశ్చర్యం !



నాగుపాము ఇంట్లోకి ప్రవేశించకుండా అడ్డుకున్న లియో (పిల్లి)

ప్యారీస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపం నెర్కుంద్రం ఎన్జీవో నగర్‌కు చెందిన బెల్లవిలే తన ఇంట్లో పిల్లిని పెంచుతున్నాడు. ఈ పిల్లిని ఆ కుటుంబం అంతా ప్రేమగా 'లియో' అని పిలుచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో సంభవించిన వరదల్లో కొట్టుకొచ్చిన పాము ఇంటి ప్రాంగణంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి ఇంట్లోకి రాబోయిన పామును లియో అడ్డుకుంది. పాలు పడగ విప్పి బుసలు కొడుతున్నా, లియో దానిని ఇంట్లోకి వెళ్లనివ్వలేదు. లియో అరుపులు విన్న బెల్లవిలే బయటకు వచ్చి పామును చూసి ఖంగుతిన్నాడు. బెల్లవిలే సమాచారంతో పాములు పట్టే వ్యక్తి అక్కడకు చేరుకొని పామును బంధించి తాంబరం అటవీ శాఖ అధికారులకు అప్పగించాడు. పామును ఇంట్లోకి రానివ్వకుండా కుటుంబ సభ్యులు ప్రాణాలను పిల్లి కాపాడడం చుట్టుపక్కల వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.



ఓంకార్, అశ్విన్

స్క్రిప్టులో 'రాజుగారి గది 4'

'రాజు గారి గది4' సినిమా స్క్రిప్ట్ వర్కు జరుగుతోందని దర్శకుడు ఓంకార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం తన తమ్ముడు, హీరో అశ్విన్‌తో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఇస్మార్ట్ జోడీ3', 'డ్యాన్స్ ఐకాన్2' షోలు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. తాను నటించిన ఓ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని అశ్విన్ చెప్పారు.

శ్రీవారి సేవలో అషిక



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సినీనటి అషిక రంగనాథ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆమె స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి